క్లుప్తంగా

ఉత్సవాలకు తరలిన గిరిజనులు



మరిపెడ రూరల్: మరిపెడ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం తలపెట్టిన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు పలు గ్రామాల నుంచి గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీఎస్ రవిచంద్ర, సర్పంచులు భరత్‌కుమార్, వీరమల్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బయ్యారం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 12 మందికి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.3,35,000 విలువైన చెక్కులను శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ బిందు బయ్యారంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కవిత, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీకాంత్, మంగీలాల్, కృష్ణ, చిరంజీవి పాల్గొన్నారు.

శంకుస్థాపన

కురవి: మండలంలోని మోద్గులగూడెం గ్రామంలో రెండు డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గాడిపల్లి రాములు శంకుస్థాపన చేశారు. శుక్రవారం గ్రామంలో రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్ రావు కోటా కింద గ్రామానికి ఇళ్లు కేటాయించారు. కార్యక్రమంలో సాయిలు, వెంకన్న, శ్రీశైలం, వెంకన్న పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి వెండి బహూకరణ



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి రథానికి వెండితాపడం చేసేందుకు హైదరాబాద్‌లోని లంగర్‌హౌజ్‌కు చెందిన గడ్డిశ్రీవాణి కరణ్‌పటేల్ దంపతులు కిలో 50 గ్రాముల వెండి బిస్కట్లను ఆలయ అధికారులకు శుక్రవారం బహూకరించారు. ఆలయ ఈఓ సత్యనారాయణ, చైర్మన్ బాదావత్ రామునాయక్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: 2023–24 విద్యా సంవత్సరానికి హైదరాబాద్ బోయినపల్లి వాటర్ స్పోర్ట్స్ స్కూల్‌లో 5వ తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజనశాఖ అధికారి ఎర్రయ్య, జిల్లా గిరిజన సంక్షేమశాఖ క్రీడల అధికారి ధరావత్ మోహన్‌నాయక్ శుక్రవారం తెలిపారు. కొత్తగూడ మండలంలోని మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఈ నెల 27, 28 తేదీల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాల్గో తరగతి, 9నుంచి 11 సంవత్సరాల వయసు ఉండాలన్నారు. బాలురు బరువు 26కేజీలు, కనీస ఎత్తు 130 సెంటీమీటర్లు, బాలికలు బరువు 25కేజీలు ఉండాలని, 129 సెంటిమీటర్ల ఎత్తు ఉండాలని, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. వివరాలకు జిల్లా గిరిజన స్పోర్ట్స్ అధికారి ధరావత్ మోహన్‌నాయక్ సెల్‌నంబర్ 94415 42265 సంప్రదించాలన్నారు.

కఠినంగా శిక్షించాలి

నెహ్రూసెంటర్: వరంగల్ కేఎంసీలో మెడికల్ విద్యార్థినిపై ర్యాగింగ్‌కు పాల్పడి, ఆమె ఆత్మహత్యయత్నానికి పాల్పడే విధంగా వేధింపులకు గురి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో గిరిజన సామాజిక వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాసంఘాల నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమ్మూర్తి, పీవైఎల్ జిల్లా కార్యదర్శి పైండ్ల యాకయ్య, డీబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాలేపాక వెంకన్న, బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి బానోత్ హుస్సేన్, టీజీఎస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు. ర్యాగింగ్‌లు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు.



నెహ్రూసెంటర్: మాట్లాడుతున్న గుగులోత్ కిషన్‌నాయక్

మహబూబాబాద్: వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంఎస్ చదువుతున్న డాక్టర్ ప్రీతిని ర్యాగింగ్ చేసిన వారిపై చర్య తీసుకోవాలని గోర్ సేన జిల్లా అధ్యక్షుడు హరిలాల్ శుక్రవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సురేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: వైద్య విద్యార్థిని ప్రీతిని వేధింపులకు గురిచేసిన సైఫ్‌ను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని సేవాలాల్ సేన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య రవినాయక్, కల్పనాసునీల్‌నాయక్, గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నాయక్ శుక్రవారం డిమాండ్ చేశారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ అభివృద్ధికి అన్నివిధాలా కృషి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా మార్చేందుకు పాటుపడతానని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. 30వ వార్డు పరిధిలో 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.5 లక్షల వ్యయంతో నిర్మాణం చేయనున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత నెల 12న జిల్లాలో కలెక్టరేట్, పార్టీ కార్యాలయంను సీఎం ప్రారంభించి జరిగిన సమావేశంలో మానుకోట మున్సిపాలిటీకి రూ.50 కోట్లు కేటాయించారన్నారు. ఆ నిధులతో ప్రజల అవసరాలను బట్టి ఆయా వార్డులలో కేటాయించడం జరుగుతుందన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని లేకుంటే బిల్లులు నిలిపి వేయాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్‌ఫరీద్, బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్, కోఆప్షన్ సభ్యురాలు జన్ను అనిత, నాయకులు సారయ్య, బిక్షం, మహేందర్, తదితరులు పాల్గొన్నారు. 13వార్డులో ఎమ్మెల్సీ సీడీఎఫ్ ఫండ్ నుంచి రూ 4.99 లక్షలతో నిర్మాణం చేయనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కౌన్సిలర్లు వేణుమాధవ్, వెంకన్న, హరిసింగ్, విజయమ్మ, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాస్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



30వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

ఏకపక్షంగా జిల్లా అథ్లెటిక్స్ ఎన్నికలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఎన్నికలు అక్రమంగా, ఏకపక్షంగా నిర్వహించారని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు పుష్పలీల, రాజకుమారి, సింధువర్మ, శివకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గౌతమి జూనియర్ కళాశాలలో శుక్రవారం వారు జిల్లా అథ్లెటిక్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని తెలంగాణ రాష్ట్ర అబ్జర్వర్ మహేందర్, ఉమ్మడి ఒలంపిక్ అసోసియేషన్ అబ్జర్వర్ కైలాష్, జిల్లా క్రీడల శాఖ అధికారి అనిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన కమిటీలో ఏ ఒక్కరూ కూడా ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులు లేరని, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులను అవకాశం కల్పించలేదన్నారు. వెంటనే రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ బాధ్యులు చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమల్ కిషోర్, అరుణ, వెన్నెల, చాంప్లనాయక్, పూల్‌సింగ్, మాల్లారెడ్డి, వీరభద్రం, మాధవి,జ్యోతి పాల్గొన్నారు.



అధికారికి వినతిపత్రం ఇస్తున్న క్రీడాకారులు

సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవంగర: దివ్యాంగుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెలలో నిర్వహించే సదరం క్యాంపు కోసం నేడు మీసేవా కేంద్రంలో స్లాట్స్ బుక్ చేసుకోవాలని తెలిపారు. ఉదయం 12:30 గంటల నుంచి స్లాట్స్ బుక్ చేసుకొనే అవకాశం ఉందన్నారు. కొత్తవి 500 స్లాట్స్ బుక్ చేసుకొనేందుకు అవకాశం ఉందన్నారు. బుక్ చేసుకున్న అనంతరం మీ సేవలో రశీదులో ఇచ్చిన తేదీ ప్రకారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం జనరల్ ఆస్పత్రిలో చేపట్టే సదరం క్యాంపుకు హాజరు కావాలని తెలిపారు.

కుక్కల స్వైరవిహారాన్ని అరికట్టాలి



ఏబీసీ సెంటర్ సందర్శిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్: వీధి కుక్కలకు ఏబీసీ సెంటర్‌లో త్వరగా ఆపరేషన్లు చేయాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారులో గల జంతువు జనన నియంత్రణ కేంద్రంను (ఎనిమల్ బర్త్ కంట్రోల్‌సెంటర్) శుక్రవారం రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్ టి.ప్రసన్నరాణి సందర్శించారు. ఏబీసీ సెంటర్‌లో చేసిన ఆపరేషన్‌ల వివరాలు ఇతరత్రా వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో జరిగిన సంఘటన నేపథ్యంలో సిబ్బంది మరింత అప్రమత్తమైన కుక్కల స్వైర విహారాన్ని అరికట్టాలన్నారు.

కుక్కల, కోతుల బెడదను అరికట్టాలి

కుక్కల, కోతుల, పందుల బెడదను అరికట్టాలని సీపీఎం నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, రావుల రాజు డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా చేసి కమిషనర్ టి.ప్రసన్నరాణికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కుక్కల, కోతుల దాడులలో చాలా మంది గాయాల పాలవుతున్నారన్నారు. వాటిని అరికట్టడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, సురేష్, రాజేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు నమోదు చేయాలి

మరిపెడ: ఖాదీర్‌ఖాన్‌ను లాకప్‌డెత్ చేసిన పోలీస్ అధికారులపై హత్య కేసు నమోదు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి ఐనాల పరశురాములు డిమాండ్ చేశారు. ఈమేరకు మరిపెడ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. రోడ్లపై పండ్లు అమ్ముకునే నిరుపేద ముస్లిం వ్యక్తిపై దొంగతనం నేరం మోపి, అరెస్ట్ చేసిన పోలీసులు విచక్షణ రహితంగా కొట్టారన్నారు. దీంతో ఆయన మరణించాడన్నారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు అబ్దుల్ రషీద్, యాకూబ్‌జానీ, రజబెల్లి, మహబూబ్, జిలానీ, షబ్బీర్, కృష్ణమూర్తి, ప్రవీణ్, పరశురాములు, రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న నాయకులు

అధిక ధరలకు యూరియా విక్రయం

నెల్లికుదురు: రైతులు సాగు చేస్తున్న పంటల ఎదుగుదలకు ఉపయోగించే యూరియా బస్తాలను అధిక ధరలకు విక్రయిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఏఐకేఎంఎస్ జిల్లా కోశాధికారి ఆలకుంట్ల సాయన్న అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ ఫర్టిలైజర్ షాపుల్లో ప్రభుత్వ ధర రూ.266లకు విక్రయించాల్సిన యూరియా బస్తా రూ.330ల ప్రకారం ఒక్కో బస్తాకు రూ.64 అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో రైతులు నక్క యాకయ్య, ఎల్లయ్య, హనుమ, రాజు, మైబు, సుందర్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణ పనులు ప్రారంభం

పెద్దవంగర: తండాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని సర్పంచ్ గుగులోత్ పటేల్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోచంపల్లి పరిధిలోని రాజ్‌మాన్‌సింగ్ తండాలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. మంత్రి దయాకర్‌రావు చొరవతో ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ. 20లక్షలతో నూతన భవన నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ యుగేందర్, నాయకులు దుంపల సమ్మయ్య, బొమ్మెరబోయిన రాజు, ఉప సర్పంచ్ జాటోతు హరిసింగ్, బిక్యా నాయక్, మంగ్యా, వీరన్న, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న సర్పంచ్ పటేల్ నాయక్

శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



తొర్రూరు: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయిరాళ్లు

తొర్రూరు: విద్యార్థులు శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి బి. శైలజ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో రాష్ట్రీయ ఆవిష్కార్ సప్తాహ్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. దానిలో భాగంగా నేల ఆరోగ్య అధ్యయనం పేరిట విద్యార్థులకు నేలలు, మట్టి రకాలపై అవగాహన కల్పించారు. శైలజ మాట్లాడుతూ సైన్స్‌తోనే ప్రపంచ పురోగతి సాధ్యమని, భారతీయ శాస్త్రవేత్తలు అనేక ఆవిష్కరణలు చేసి ప్రపంచానికి అందించారని గుర్తు చేశారు. ఉపాధ్యాయురాలు పల్లవి, విద్యార్థులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు శ్రీనువాస్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఆవిష్కార్ సప్తాహ కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. విద్యార్థుల భూమికకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనునట్లు తెలిపారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ ఎండీ జలాల్, వందన, సాధిక్ అలీ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో రాష్ట్రీయ ఆవిష్కార్ సప్తాహ్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎండీ వాహిద్, గైడ్ టీచర్ గిరిజ శుక్రవారం ఆవిష్కరించారు.

విచారణ చేయాలి

కురవి: మండలంలోని నేరడ గ్రామంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఇళ్లను సీపీఐ ప్రతినిధి బృందం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60ఇళ్ల నిర్మాణంలో అవినీతి జరుగుతోందని తెలిపారు. లబ్ధిదారుల్లో ప్రభుత్వ ఉద్యోగులున్నారని ఆరోపించారు. వెంటనే విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్న, నాయకులు పోగుల శ్రీనివాస్, బొల్లం అనిల్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రేపు ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ అర్బన్: కరీంనగర్ జిల్లా రుక్మాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలురు ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో 2023–24 సంవత్సరానికి ప్రవేశాలకు ఈనెల 26 ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ ప్రత్యూష శుక్రవారం తెలిపారు. 369 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలని సూచించారు.

మండల సభ వాయిదా

నెల్లికుదురు: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి అధ్యక్షతన శుక్రవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. కోరం పూర్తిగా లేనందున మండల సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ప్రకటించింది. ఎంపీడీఓ శేషాద్రి, ఎంపీఓ పార్థసారథి పాల్గొన్నారు.

ఘనంగా పూర్ణాహుతి

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం వేద పండితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యనారాయణ, ఆలయ చైర్మన్ బాదావత్ రామునాయక్, వేదపండితులు శ్రీకర్‌శర్మ, బాలకృష్ణ, శ్రీకాంత్, శ్రీనివాస్, అనిల్, విజయ్ పాల్గొన్నారు.

జీవ ఎరువుల ప్రాధాన్యతను గుర్తించాలి

డోర్నకల్: జీవ ఎరువుల ప్రాధాన్యతను రైతులు గుర్తించాలని మండల వ్యవసాయ అధికారి రామారావు కోరారు. మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో బండ్ల వెంకన్నకు చెందిన వరి పొలంను శుక్రవారం రైతులతో కలిసి వ్యవసాయ అధికారి సందర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు చరణ్‌తేజ, అవినాష్, రైతులు బండ్ల వెంకన్న, సాయికిరణ్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

గార్ల: మండలంలోని చిన్నబంజర గ్రామానికి చెందిన బానోత్ మోతీలాల్ సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈవిషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఎస్సై వెంకన్న సెల్‌ఫోన్ ఆచూకీ తెలుసుకొని బాధితుడికి శుక్రవారం అందజేశాడు.

నట్టలమందు తప్పనిసరి

దంతాలపల్లి: రైతు నేస్తాలైన మూగజీవులకు తప్పనిసరి నట్టలమందు వేయాలని దంతాలపల్లి ఎంపీపీ ఉమామల్లారెడ్డి అన్నారు. పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం వారిచే పంపిణీ చేసిన నట్టల మందును మండలంలో రామానుజపురం గ్రామంలో శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగయ్య, మండల రైతుసమితి కోఆర్డినేటర్ మల్లారెడ్డి, పశువైద్యుడు వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ కమిటీల ఎన్నిక

కేసముద్రం: మండలంలోని కల్వల, నారాయణపురం గ్రామాల్లో అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ కమిటీలను శుక్రవారం ఎన్నుకున్నట్లు సంఘం మండల కన్వీనర్ పోలెపాక నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కల్వల గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బొడ్డు వెంకటేష్, ప్రధానకార్యదర్శి కందిపాటి శ్యాంకుమార్, నారాయణపురం అధ్యక్షుడిగా పందుల కృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు ప్రారంభం

చిన్నగూడూరు: 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ చిన్నగూడూరు పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనులను నేడు ఎమ్మెల్యే రెడ్యానాయక్ ప్రారంభించనున్నట్లు సర్పంచ్ మల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ తెలిపారు.

'కంటి వెలుగు' ప్రారంభం

కురవి: మండలంలోని నేరడ శివారు చీమ్లా తండా గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం సర్పంచ్ భూక్య మంగీలాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ధరావత్ వెంకన్న, వార్డు సభ్యులు ధరావత్ రాధాకృష్ణ, లావుడ్య వాగ్యానాయక్, భూక్య బీచ్యా, బీఆర్ఎస్ నాయకులు రవినాయక్, శ్రీను, వైద్యాధికారి ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

'పది' టాలెంట్ టెస్టులు

గార్ల: మార్చి 2,3 తేదీల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు సంఘం డివిజన్ డివిజన్ కార్యదర్శి సూర్యప్రకాష్ తెలిపారు. శుక్రవారం గార్లలో టాలెంట్ టెస్ట్‌ల కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 2న మండల, పట్టణ, 3న జిల్లా స్థాయిలో టెస్టులు నిర్వహించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి శాంతికుమార్ పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను ప్రజలకు వివరించాలి

గార్ల: పోస్టల్‌శాఖ అందిస్తున్న పలు సేవలను ప్రజలకు వివరించాలని పోస్టల్‌శాఖ సూపరింటెండెంట్ ఎం.నాగరాజు సూచించారు. శుక్రవారం గార్లలో బ్రాంచి పోస్ట్‌మాస్టర్లతో నిర్వహించిన సమావేశంను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పోస్టల్‌శాఖ అమలు చేస్తున్న ప్రతి స్కీంను ప్రజలకు వివరించి పోస్టల్‌శాఖ అభివృద్ధికి తోడ్పాటు కావాలన్నారు.


జలాభిషేకం

డోర్నకల్: మండలంలోని చిలుకోడులో గౌడ కులస్థులు రెండు రోజులుగా జరుగుతున్న శ్రీకంఠమహేశ్వర సురమాంబ కల్యాణోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం జలాభిషేకం నిర్వహించారు

పాదయాత్రను జయప్రదం చేయాలి

నెల్లికుదురు: ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం మార్చి 17నుంచి ఏప్రిల్ 17వరకు బయ్యారం నుంచి హైదరాబాద్ వరకు సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టే మహాపాదయాత్రను జయప్రదం చేయాలని కార్యకర్తలకు సీపీఐ మండల కార్యదర్శి వరిపెల్లి వెంకన్న శుక్రవారం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, స్వామి, సత్యనారాయణ, వెంకన్న, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, లక్ష్మి, సోమలక్ష్మి పాల్గొన్నారు.

స్వయం పాలన దినోత్సవం



తొర్రూరు రూరల్: మండలంలోని అమ్మాపురం ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

కేసముద్రం: కేసముద్రంవిలేజ్ శివారు ఎన్టీఆర్ నగర్‌లో గల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమాదేవి, యాదగిరి, ఎస్ఎంసీ చైర్మన్ సంధ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

కూలికి వెళ్తుండగా ఒకరు మృతి

మహబూబాబాద్ రూరల్: పొట్టకూటి కోసం కూలి పనులు చేసుకుని జీవించే ఓ యువకుడు పనుల నిమిత్తమై వెళ్తుండగా రోడ్డుప్రమాదంలో మృతి చెందిన సంఘటన మండలంలోని అమనగల్ గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై సీహెచ్ అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామానికి చెందిన బోదాసు మధు (25) కుటుంబ పోషణ కోసం కూలి పనులు ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లి పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మురిపిరాల గ్రామానికి చెందిన మృతుడి బామ్మర్ది ఓర్సు అశోక్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్ వైపునకు వెళ్తున్నారు. ద్విచక్ర వాహనం అమనగల్ గ్రామం దాటుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న క్రేన్ వాహనానికి వెనుక భాగంలో తగిలింది. ఈప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న అశోక్ స్వల్ప గాయాలు కాగా, వెనకాల కూర్చున్న మధు గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా బోదాసు మధు మృతిపై అతడి బంధువులు అనుమానం వ్యక్తం చేశారు.

ద్విచక్ర వాహనం నుంచి మంటలు

మహబూబాబాద్ రూరల్: ద్విచక్ర వాహనం నుంచి అకస్మాత్తుగా మంటలు వ్యాపించి వాహనం పాక్షికంగా దగ్ధమైన సంఘటన జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సీరోలు మండలానికి చెందిన ఆంగోత్ రెడ్యా అనే రైతు అమనగల్ గ్రామం నుంచి పచ్చజొన్నల బస్తా తీసుకుని ఇంటికి వెళ్తున్నాడు. వాహనం మధ్యాహ్నం గ్రంథాలయ సమీపంలోకి రాగానే అందులోంచి పొగలు రావడాన్ని రెడ్యా గమనించాడు. ద్విచక్ర వాహనాన్ని అక్కడే ఆపి పరిశీలిస్తుండగా అందులోంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు వెంటనే బకెట్లతో నీళ్లు తీసుకువచ్చి మంటలను ఆర్పారు. ప్రమాదంలో వాహనం పాక్షికంగా దగ్ధమైంది. స్థానికులు స్పందించి మంటలను చల్లార్చడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

జైలుకు గుడుంబా విక్రయదారులు

గూడూరు: ప్రభుత్వ నిషేధిత అక్రమ నల్లబెల్లం, నాటు సారా తయారీ, విక్రయాలకు పాల్పడిన వారికి జైలు శిక్షలు తప్పవని ఎక్సైజ్ సీఐ ఎన్.భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేసముద్రం మండలం భవానిగడ్డ తండాకు చెందిన ఇద్దరు నల్లబెల్లం, నాటుసారా తయారీ విక్రయదారులపై పీడీ యాక్ట్ కేసుతోపాటు, కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం రాత్రి చర్లపల్లి జైలుకు పంపించినట్లు సీఐ తెలిపారు. భవానిగడ్డతండాకు చెందిన నూనావత్ కిషన్, నూనావత్ రాము అనే ఇద్దరు వ్యక్తులు కర్నాటక రాష్ట్రం బీదర్ నుంచి అక్రమంగా నల్లబెల్లం రవాణకు పాల్పడుతూ పలు సార్లు చిక్కారన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జయశ్రీగౌడ్, హెడ్ కానిస్టేబుల్ బుచ్చయ్య, కానిస్టేబుల్ సుధాకర్, నరేష్, యుగంధర్, దేవేందర్ పాల్గొన్నారు.

గుడుంబా విక్రయ కేసులో అరెస్ట్

నర్సింహులపేట: గుడుంబా అక్రమ విక్రయ కేసులో శుక్రవారం మూడు కేసుల్లో 7 గురిని అరెస్ట్ చేసినట్లు తొర్రూర్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కొమ్ములవంచ, నర్సింహులపేట గ్రామాల్లో అక్రమంగా గుడుంబాను విక్రయిస్తున్న ఘటనలో 29లీటర్ల సారాయి, రెండు ద్విచక్ర వాహనాలు పట్టుకొని శుక్రవారం సీజ్ చేసినట్లు తెలిపారు. ఎస్సై శ్రీనివాస్, పీసీలు మధుకర్, సత్యప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో వృద్ధుడికి గాయాలు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని దామ్య తండా గ్రామానికి గుగులోత్ చాంప్లా అనే వృద్ధ రైతుపై కుక్కలు దాడి చేయగా శుక్రవారం గాయాలయ్యాయి. ఈ సంఘటనలో అతడి ఎడమ మోకాలు కింది భాగంలో గాయాలయ్యాయి.

పాకాలవాగులో మృతదేహం లభ్యం



గూడూరు: పాకాలవాగు బ్రిడ్జి కింద శుక్రవారం ఉదయం మృతదేహం లభించినట్లు ఎస్సై సతీష్‌గౌడ్ తెలిపారు. వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ కేంద్రం సర్వాపురం గ్రామానికి చెందిన ఎల్లాపురం రమేష్ (35)గా వాట్సాప్ గ్రూపుల్లో చూసిన అతడి బంధువులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఎల్లాపురం రమేష్‌కు ఇద్దరు భార్యలు ఉన్నట్లు, పెద్ద భార్య భవానికి ఇద్దరు కొడుకులు ఉండగా, రమేష్ మరో మహిళతో కాపురం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ ఉంటున్నాడని, మృత దేహాన్ని చూసిన మొదటి భార్య భవాని తెలిపింది. ఎలా చనిపోయాడు, ఇక్కడికి ఎలా వచ్చాడో తనకు తెలియదని, రమేష్‌కు తల్లి ఉందని, శనివారం ఆమెతోపాటు మరో మహిళను తీసుకొని వస్తానని చెప్పిందని ఎస్సై తెలిపారు. ఎలా చనిపోయాడనే వివరాలు రేపు వారిని విచారించాక తెలుస్తుందన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



మరిపెడ రూరల్: మరిపెడ మండలం గుండెపుడి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చాటారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మాధ లావణ్య, 8వ తరగతి చదువుతున్న బోడపట్ల మనోహర్ జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతులు సాధించినట్లు హెచ్‌ఎం కుడితి ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

దంతాలపల్లి: సైన్స్ డే పోటీల్లో ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీలు శ్రీవాణి, జ్యోత్స్న బహుమతులు సాధించినట్లు హెచ్‌ఎం శ్రీనువాస్ తెలిపారు. ఉపాధ్యాయులు బ్రహ్మనందరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, గైడ్ టీచర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.